చేసింది గోరంత.. బిల్లు కొండంత

- సీఎం పర్యటన నెపంతో సొమ్ములు స్వాహాకు యత్నం
- చేయని పనులకు బిల్లులు పెట్టిన మున్సిపల్ అధికారులు
- కౌన్సిల్ సభ్యుల రగడతో ఆమోదం పొందని రూ.15 లక్షల బిల్లు


సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ వద్ద వాటరింగ్ చేస్తున్న ట్రాక్టర్ (ఫైల్)


జంగిల్ క్లియరెన్స్ లేకుండా ముగ్గు వేస్తున్న శానిటరీ సిబ్బంది

పెద్దాపురం: సీఎం చంద్రబాబు పర్యటనతో ప్రకటనలు.. ఫ్లెక్సీలు.. ఆర్భాటం మినహా ప్రజలకు ఒరిగిందేమి లేదు. రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని చెప్పుకోవాలి. ఇదే అదను అనుకున్నారో ఏమో పెద్దాపురం మున్సిపల్ అధికారులు రూ.లక్షల్లో బిల్లులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. చేయని పనులకు బిల్లులు పెట్టి కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో కౌన్సిల్ సభ్యులు అధికారుల తీరు, బిల్లుల విషయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి బిల్లుకు ఆమోదం తెలుపకుండా ఆ అంశాన్ని వాయిదా వేశారు. రూ.నాలుగు లక్షల పనులు చేస్తే రూ.15 లక్షల వరకూ బిల్లులు పెట్టడం పట్ల కౌన్సిల్ మండిపడింది.

జంగిల్ క్లియరెన్స్‌కు భారీగా బిల్లులు

మరిడమ్మ గుడి వద్ద ఉన్న మనోజ్ చెరువు జంగిల్ క్లియరన్స్‌కు రూ.69 వేలు, దర్గా సెంటర్ నుంచి కొత్తపేట చెరువు వరకు రూ.96 వేలు, ఏడీబీ రోడ్డు నుంచి గుర్రాల సెంటర్ వరకు రూ.98 వేలు మరిడమ్మ గుడి నుంచి దర్గా సెంటర్ వరకు రూ.94 వేలు, కొండయ్యపేట నుంచి ప్రసన్నాంజనేయ స్వామి గుడి వరకు రూ.90 వేలు, హెలీప్యాడ్ వద్ద లెవిలింగ్, జంగిల్ క్లియరన్స్‌లకు రూ.98 వేలు వెరసి జంగిల్ క్లియరన్స్, బెర్మ్, వేస్ట్ మెయింటెనెన్స్‌కు రూ.5,40,000 బిల్లు పెట్టారు. మరిడమ్మ గుడి వద్ద నుంచి దర్గా సెంటర్, అక్కడ నుంచి గుర్రాల సెంటర్ వరకూ పిచ్చి మొక్కలు కానీ, చెత్త కాని ఉండదు. నిత్యం వ్యాపార సముదాయం, జన సంచారం ఉంటుంది. అక్కడ పరిశుభ్రంగా ఉన్న చోటనే ముగ్గు చల్లి బిల్లులు పెట్టేశారు.

హెలిప్యాడ్, ప్రజా వేదిక వద్ద..

సీఎం చంద్రబాబు హెలీప్యాడ్ వద్ద వాటర్ స్ప్రే చేసినందుకు రూ.79 వేలు, ప్రజా వేదిక వద్ద గ్రావెల్‌తో చదునుకు రూ.99 వేలు వెరసి సుమారుగా రూ.2 లక్షల బిల్లు పెట్టారు. పెద్దాపురం మున్సిపాలిటీకి దవులూరి ట్రస్ట్ ఇచ్చిన వాటర్ ట్యాంక్‌తోనే పనులు చేశారు. కాగా అద్దెకు తీసుకువచ్చినట్లుగా బిల్లులు చూపించారు.

టాయిలెట్స్, సెంటర్ డివైడర్స్ పెయింటింగ్ రూ.5 లక్షలు

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మొబైల్ టాయిలెట్స్ 12 ఏర్పాటు చేశారు. రెండు రోజులకు రూ.రెండు లక్షలు బిల్లు పెంచి పెట్టడమేమిటనవి కౌన్సిల్ ప్రశ్నించింది. అలాగే సెంటర్ డివైడర్స్‌లో మూడు కిలోమీటర్లకు రూ. 3.42 లక్షలు బిల్లుల ఆమోదం కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ జరిగిన పనులకు వేసిన బిల్లులకు సంబంధం లేదంటూ కౌన్సిల్ మండిపడింది. అజెండాలోని మూడో అంశాన్ని వాయిదా వేసింది. తదుపరి సమావేశంలో పూర్తి వివరాలతో బిల్లు పెట్టాలని కౌన్సిల్ కోరింది.

30 శాతం పనులు చేసి నూరు శాతం బిల్లులు



సీఎం పర్యటన నేపథ్యంలో ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వం నుంచి, జిల్లా కలెక్టర్ నిధుల నుంచి ఖర్చు చేస్తే బాగుండేది. చిన్న మున్సిపాలిటీకి జనరల్ నిధులు తక్కువ. అందులో 30 శాతం మాత్రమే పనులు చేసి నూరు శాతం బిల్లులు పెట్టడం సరికాదు. అధికారులు పెట్టిన బిల్లుల్లో 70 శాతం వృథాగానే పెట్టినట్టు ఉంది. దీనిపై వచ్చే సమావేశంలో తప్పకుండా మాట్లాడతాం.

– విజ్జపు రాజశేఖర్, సీనియర్ కౌన్సిలర్, పెద్దాపురం

ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో..



సీఎం పర్యటనకు ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. నిధులు రాకపోవడంతో పని ముందుకు జరగాలి కాబట్టి జనరల్ నిధులు నుంచి ఖర్చు చేశాం. జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచాం. తప్పకుండా ప్రభుత్వం నుంచి సొమ్ములు రిలీజ్ అయితే మున్సిపల్ జనరల్ నిధుల్లోకి యాడ్ చేస్తాం. మున్సిపల్ నిధులు వృథా చేసే పని అధికారులు ఎందుకు చేస్తారు.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

క్లుప్తంగా

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


మరిడమ్మ ఆలయంలో అన్నదానం

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తుల రద్దీ పెరిగింది. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.

ఘనంగా భువనేశ్వరి మాత జయంతి వేడుకలు


భువనేశ్వరి పీఠంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: స్థానిక వర్జులవారి వీధిలో వేంచేసిన భువనేశ్వరి మాత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఓం శక్తి, ఆదిశక్తి పేరిట ప్రత్యేక అలంకరణ చేసి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆవుల సంరక్షణకు చర్యలు


గోవులకు పశుగ్రాసం అందిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: హిందూ సంస్కృతిలో ఆవును తల్లిగా పరిగణిస్తారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేసన్ ఆధ్వర్యంలో స్థానిక జంతు హింస నివారణ సంఘంలో ఉన్న ఆవుల సంరక్షణ బాధ్యతలను ఆదివారం అసోసియేషన్ చేపట్టింది. ఆవులకు పశుగ్రాసం అందించారు. ఆవు పాలు అత్యంత విలువైనవని, తల్లిపాల తర్వాత పిల్లలకు పోషకాహారానికి ఆవు పాలు ప్రాథమిక వనరు అన్నారు. ఆవు జాతులను రక్షించేందుకు గోశాలలను కాపాడుకోవాలన్నారు. ప్రముఖ వైద్యులు వీరభద్రరావు మాట్లాడుతూ ఆవు పెంపుడు జంతువులకు అత్యంత అనుకూలమైనవని, పురాతన నాగరికతల నుంచి ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజంతో ముడిపడి ఉందన్నారు. భారత దేశానికి పశువుల పెంపకంలో గొప్ప చరిత్ర ఉందని, భారతదేశం పవిత్రమైన ఆవుల భూమిగా పరిగణిస్తారన్నారు.

గణపతికి గరిక పూజ


వినాయకునికి గరిక పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానం దొడ్డిలో ఏర్పాటు చేసిన గణపతి మందిరాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సస్యశ్యామలంగా పండాలని గరిక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ


సత్యనారాయపురంలో సరస్వతీదేవి పూజలు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో సరస్వతీదేవికి ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఏటా రామాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా చిన్నారులకు సరస్వతీదేవి పూజలను ఏర్పాటు చేశారు. వార్డు కౌన్సిలర్ సేపేని సురేష్‌ను సరస్వతీదేవి పూజను ప్రారంభించారు. చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజలకు కావలసిన సామగ్రిని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్ట కొట్టింది

సీపీఐ నాయకుడు సాకా రామకృష్ణ


పిఠాపురంలో ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న రామకృష్ణ

పిఠాపురం: ప్రభుత్వం ఏదైనా పథకం అమలు చేస్తే ప్రజల పొట్ట నింపేలా ఉండాలి కాని పొట్ట కొట్టేలా ఉండకూడదని సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ అన్నారు. పిఠాపురంలో ఆదివారం రజాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు నిర్వహించిన ఆందోళనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేయడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. పథకాలు ప్రవేశపెట్టే ముందు ఎవరికీ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం లేచి ఆటో నడుపుకుంటే గాని జీవనోపాధి సాగని ఆటో కార్మికుల పొట్ట కొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఆటో డ్రైవర్లు డిగ్రీలు చదువుకుని జీవనోపాధి లేక ఈ వృత్తిని సాగిస్తున్నారన్నారు. ఫ్రీబస్సు పథకంతో ఆర్టీసీ ఆదాయం పడిపోతుందని, డీజిల్ వాడకాలు తగ్గుతాయని, ఆటో మెకానిక్‌లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పందించి మంచి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు నెలకు రూ.20 వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో కార్మికులతో కలసి దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పందిరి లోవరాజు, కంది ప్రసాద్, సన్నా బత్తుల లక్ష్మణ్ గోవింద్, బందిల మోహన్, బొండాడ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

కొత్తపల్లి: వాకతిప్ప తహసీల్దార్ కార్యాలయం వెనుక కాలనీలోని వరసిద్ధ వినాయక అలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్తపల్లి, కుతుకుడుల్లి, ఉప్పాడ గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

అన్నదానం

సామర్లకోట: స్థానిక సంపెంగతోటలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. సంపెంగతోట వద్ద గత 10 ఏళ్లుగా గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏటా గణేశ్ విగ్రహ నిమజ్జనమైన తరువాత అన్నదానం ఏర్పాటు చేసేవారు. ఇక్కడ గణపతిని ఏటా తొమిదో రోజు నిమజ్జనం చేసేవారు. ఈ ఏడాది తొమ్మిదో రోజు తరువాత చంద్రగ్రహణం రావడంతో అన్నదానాన్ని ముందుగా నిర్వహించి తదుపరి గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కౌన్సిలర్లు సేపెని సురేష్, బలుసు వాసు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపతి

- వైభవంగా గణేశ్ నిమజ్జనాలు
- గోదావరి కాలువ వద్ద ఏర్పాట్లు శూన్యం
- కాలువలో పెరిగిన నీటి మట్టం


సామర్లకోట గోదావరి కాలువలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి గణేశ్ నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ స్నానాల రేవులో వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. పట్టణ, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు పెద్దాపురం మున్సిపాలిటీ, మండల పరిధిలో గత నెల 27న ఏర్పాటు చేసిన గణేశ్ శిబిరాల్లో గణపతి విగ్రహాన్ని సామర్లకోట గోదావరి కాలువలో నిమజ్జనం చేస్తారు. గోదావరి కాలువకు వరద నీరు రావడంతో ధవళేశ్వరం నుంచి ప్రమాద స్థాయికి మించి చేరిన నీటిని దిగువ ప్రాంతాలకు విడిచి పెట్టారు. ప్రస్తుతం గోదావరి కాలువలో నీటి మట్టం 15 అడుగులకు మించి ఉంది. ఇక్కడ నిమజ్జనాలు జరుగుతున్న సమయంలో పోలీసులు గాని, మున్సిపల్ అధికారులు గాని, రెవెన్యూ అధికారులు కాని ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. గోదావరి కాలువ స్నానాల రేవులో ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ మునిగిపోయింది. గోదావరి కాలువలో నిమజ్జనాలు జరిగే ప్రదేశంలో బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు గజఈత గాళ్లను నియమించవలసి ఉంది. కాగా అధికారులు అటువంటి ఏర్పాట్లు చేయలేదు. నాలుగు అడుగుల లోపు విగ్రహాలను మాత్రమే ఆదివారం నిమజ్జనం చేశారు. స్వామివారి ఊరేగింపులో పిల్లలు, మహిళలు సందడి చేశారు. అధికారులు ఇద్దరు పోలీసులను నియమించి చేతులు దులుపుకున్నారు. పోలీసు సిబ్బంది డ్రోన్ కెమెరా సాయంతో నిమజ్జనాలను చిత్రీకరించారు. ఏటా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ప్రస్తుతం పోలీసులు మినహా మిగిలిన సిబ్బంది కానరాలేదు. ఈ నెల 7న చంద్రగహణం కావడంతో గణపతి విగ్రహాలను ఈ నెల 5వ తేదీ లోపు నిమజ్జనం చేసేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.


ఉప్పాడలో గణపతి నిమజ్జనాల సందడి

ఘనంగా నిమజ్జనాలు

కొత్తపల్లి: సాగర తీరంలో ఆదివారం గణపతి నిమజ్జనాల సందడి నెలకొంది. గణపతి విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనోత్సవంతో సాగరతీరం నిండిపోయింది. వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. ఉప్పాడ సముద్రంలో మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా తీసుకొచ్చి సాగరంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం స్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నిర్లక్ష్యం నీడలో నీలమ్మ చెరువు


నీలమ్మ చెరువులో పెరిగిపోయిన గడ్డి, తుప్పలు


చెరువు గట్టుపై ఏపుగా ఎదిగిన తుప్పలు

- కొలను చుట్టూ పెరిగిపోయిన గడ్డి, తుప్పలు
- స్వైరవిహారం చేస్తున్న పాములు
- వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్న వాకర్లు

సామర్లకోట: పట్టణంలో ఎంతో ప్రసిద్ధి చెందిన నీలమ్మ చెరువుపై మున్సిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణానికి నడిబొడ్డులో ఉన్న ఈ చెరువులో నీటిని సుమారు 40 ఏళ్ల క్రితం వరకూ తాగునీరుగా ఉపయోగించే వారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నాల్గో విడత జన్మభూమి కార్యక్రమంలో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా చెరువు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అప్పట్లో రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులు దుర్వినియోగం కావడంతో అప్పటి నుంచి చెరువు నిరూపయోగంగా నిలిచిపోయింది.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి

నీలమ్మ చెరువు చుట్టూ 11, 13, 14, 17, 19, 20 వార్డులు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేసి చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు పార్కు పనులు చేయవలసి ఉంది. ఈ సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. సుమారు ఏడాదిన్నరగా చెరువుపై శ్రద్ధ చూపలేదు. చెరువు గట్టుపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. చెరువుపై శ్రద్ధచూపక పోవడంతో చెరువులో గడ్డి, తుప్పలు పెరిగి పోయాయి. అదే విధంగా చెరువు గట్టుపై తుప్పలు పెరిగి పోయాయి. ఇటీవల పచ్చదనం పరిశుభ్రం కార్యక్రమంలో భాగంగా చెరువు గట్టుపై మొక్కలు వేసినా వాటిపై పర్యవేక్షణ కరువైంది.

వాకింగ్‌కు ఇక్కట్లు

నీలమ్మ చెరువు చుట్టూ ఉన్న ప్రజలే కాకుండా అనేక ప్రాంతాలకు చెందిన వాకర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో చెరువు గట్టుపై వాకింగ్ చేస్తారు. వీరిలో ఎక్కువగా మహిళలు వాకింగ్ చేయడం విశేషం. వాకింగ్ ట్రాక్‌పై తుప్పలు పెరిగిపోవడంతో పాటు, మద్యం సీసాలు దర్శనం ఇస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకే చెరువు గట్టుపై ఉన్న లైట్లు తీసి వేయడం వలన అంధకారంలో వాకింగ్ చేయవలసి వస్తోందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోనూ, గట్టుపై తుప్పలు పెరిగిపోవడం వలన పాములు స్వైర విహారం చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. వాకింగ్ ట్రాక్‌ను శుభ్రంగా ఉంచవలసిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాకర్స్ మండిపడుతున్నారు.

పాములు సంచరిస్తున్నాయి



నీలమ్మ చెరువు గట్టుపై తుప్పలు పెరిగిపోవడంతో పాములు సంచరిస్తున్నాయి. నీలమ్మ చెరువు సమీపంలో ఉన్న అనేక మంది మహిళలతో కలిసి ప్రతిరోజు ఉదయం వాకింగ్ చేస్తాను. పచ్చదనం పరిశుభ్రం కార్యక్రమంలో అధికారులు ఫొటోలకు పోజులు ఇస్తున్నారు. శనివారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో నా ముందు నుంచి పాము వెళ్లింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నా ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. నీలమ్మ చెరువు గట్టుపై లైట్లు కూడా వెలగడం లేదు. సమస్యను కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాను.

– రెడ్నం సునీత, కౌన్సిలర్, సామర్లకోట

తుప్పలు తొలగిస్తాం



వర్షాలకు పిచ్చి మొక్కలు వేగంగా పెరిగిపోయాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో చెరువు గట్టుపై తుప్పలు పెరిగిపోయినట్టు కౌన్సిలర్లు మా దృష్టికి తీసుకొచ్చారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా తుప్పలను తొలగించే కార్యక్రమం నిర్వహిస్తాం.

– జవహర్ రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సామర్లకోట

న్యాయవాదుల గుమస్తాల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

కాకినాడ లీగల్: న్యాయవాదుల గుమస్తాల సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది. ఆదివారం కాకినాడ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరియాల శ్రీను అధ్యక్షతన బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో 26 జిల్లాలో గుమాస్తాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, డెత్ బెనిఫిట్ వంటి అంశాలపై చర్చించారు. ముందుగా సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన కోర్టు ఫీజులో ఒక్క శాతం న్యాయవాదులకు, న్యాయవాదుల గుమస్తాలకు సంక్షేమ నిధికి ఇస్తున్నారని, అలాగే మన రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు, న్యాయవాదుల గుమస్తాలకు సంక్షేమ నిధికి ఒక్క శాతం అమలు చేయలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ మాట్లాడుతూ కోర్టులో ఈ-సేవా కేంద్రాలు వల్ల గుమస్తాలు కనమరగు అయ్యే ప్రమాదం ఉందన్నారు. మాజీ లా సెక్రటరీ గాదం సత్య ప్రభాకరరావు మాట్లాడుతూ గుమస్తాలు లేనిదే న్యాయవాదుల్లేరని గుమస్తాలు వల్ల న్యాయవాది అనేక విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బయ్య మాట్లాడుతూ గుమస్తాల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం తీసుకొచ్చిన యాక్ట్ 13/92 ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్‌ను అమలు చేయడంలో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్దాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధన కార్యదర్శి నల్ల భాస్కరరావు మాట్లాడుతూ గుమాస్తాల పిల్లల విద్య, కుటుంబ భద్రత కోసం ప్రత్యేక నిధి అవసరమని చెప్పారు. ఈ సమావేశంలోకాకినాడ బార్ అసోసియేషన్ అధక్ష,కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు, కాకినాడ న్యాయవాదుల గుమస్తాల సంఘం సెక్రటరీ డి.రాంబాబు, జాయింట్ సెక్రటరీ జీఎస్ఆర్ కృష్ణ, కోశాధికారి యండూరి గోపి, వల్లా భాస్కరావు, గుమస్తాలు సీహెచ్ ప్రభాకర్ నాయుడు, వడ్లమూరి సతీష్, బీరక శ్రీనివాస్, ఐవీ రమణ, జె.వర ప్రసాద్, దరిశిపూడి సూర్యనారాయాణ మూర్తి, తానాల కాశీ విశ్వనాథ్, నముడూరి వెంకట్రావు, మర్ల సుబ్రహ్మణ్యం, నర్కెడమిల్లి నగేష్, మేడిశెట్టి గంగాధర్, జీఎస్ఆర్ కృష్ణ, మహదశ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు

బోట్‌క్లబ్: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లో వింజమూరి వెంకట సుబ్బారావు నివాసంలో రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సంకీర్తన, అనంతరం రాధారాణి మహాత్యంపై ప్రత్యేక ఉపన్యాసం, పారాయణం, ప్రత్యేక భజనలు, మధ్యాహ్నం మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణా మూమెంట్ ప్రతినిధి వై.కంటేశ్వరప్రభుదాసు రాధారాణి మహిమను భక్తులు వివరించారు.